క్లుప్తంగా

వేతనాలు మంజూరు చేయండి



వినతి పత్రం అందజేస్తున్న సెక్యూరిటీ గార్డులు

బుక్కరాయసముద్రం: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని డీటీఓ రామాంజనేయులుకు బుధవారం కార్మికులు వినతిపత్రం అందజేశారు. కార్మిక నాయకుడు సుధాకర్ మాట్లాడుతూ ఎస్టీ గురుకుల పాఠశాలల్లో 15 మంది సెక్యూరిటీ గార్డులుగా ఎన్‌ఆర్‌ఆర్ ఏజెన్సీ కింద పని చేస్తున్నామన్నారు. తమకు నెలకు రూ.8 వేల వేతనం ఇస్తున్నారన్నారు. అయితే ప్రభుత్వం నాలుగు నెలలుగా వేతనాలు మంజూరు చేయలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న జీతాలు వెంటనే మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు బాలక్రిష్ణ, పోతన్న, రామాంజినేయులు, ప్రకాష్, మాణిక్యం, సుబ్రమణ్యం, కవిత, మల్లేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం



నిరంజన్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బుక్కరాయసముద్రం: కొర్రపాడు జెడ్పీ హైస్కూల్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడుగా పని చేస్తున్న నిరంజన్‌రెడ్డిని బుధవారం పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. ఇటీవల నిరంజన్‌రెడ్డి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన సంగతి తెలిసిందే. కొర్రపాడు జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయులు ఆయన్ను శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు.

పశు వైద్య శిబిరం



పశువుకు చికిత్స చేస్తున్న డాక్టర్ పద్మనాభం

శింగనమల: వెస్ట్ నరసాపురంలో బుధవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్. పద్మనాభం ఎదకురాని పశువులు, కట్టు నిలవని పశువులకు చికిత్స అందించారు. కార్యక్రమంలో తరిమెల పశువైద్యశాల అధికారి డాక్టర్. మౌనప్రియ, సిబ్బంది గాయిత్రి, వరలక్ష్మి, పావని, గోపాల మిత్ర మునీంద్ర పాల్గొన్నారు.

రాయితీపై పశుదాణా

శింగనమల: పాడి పశువులకు 75 శాతం రాయితీతో దాణా అందిస్తున్నామని పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్.పద్మనాభం బుధవారం తెలిపారు. ఒక కేజీ సంపూర్ణ దాణాకు రూ.6.50 చెల్లించాలని, ఒక్కో రైతుకు 1800 కేజీల వరకు అందిస్తామన్నారు. ఒక గ్రామంలో 25 మెట్రిక్ టన్నుల దాణా రైతులు బుక్ చేసుకుంటే నేరుగా గ్రామానికి సరఫరా చేస్తామని తెలిపారు.


క్రీడా సామగ్రి పంపిణీ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు రమణారెడ్డి బుధవారం విద్యార్థినులకు క్రీడా సామగ్రి పంపిణీ చేశారు. ఎస్టీయూ జిల్లా ఆర్థిక కార్యదర్శి ప్రసాద్, మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆసీఫ్, బసవరాజు, జిల్లా ఉపాధ్యక్షులు శంకరయ్య, సీనియర్ నాయకులు డానియేల్, సూర్య ప్రకాష్‌రెడ్డి, వన్నయ్య, సత్యనారాయణ, కష్ణమూర్తి, నారాయణ స్వామి, ఆంజనేయులు, శ్రీరాములు పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

బుక్కరాయసముద్రం: రేకులకుంట సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. అనంతపురం నగరానికి చెందిన పవన్ నార్పల నుంచి అనంతపురం బైక్‌పై బయలుదేరాడు. నార్పలకు చెందిన కిరణ్ అనే వ్యక్తి అనంతపురం నుంచి నార్పలకు బైక్‌పై వెళ్తూ రేకులకుంట సమీపంలో పవన్ బైక్‌ను ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

రైతు ఆత్మహత్య



మల్లికార్జున(ఫైల్)

బుక్కరాయసముద్రం: దయ్యాలకుంటపల్లిలో అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున(47) తనకున్న మూడున్నర ఎకరాల్లో బోర్ల కింద పంటలు సాగు చేసేవాడు. పంటలు సరిగా పండకపోవడంతో పెట్టుబడులు చేసిన అప్పులు తీర్చలేకపోయాడు. దాదాపు రూ.10 లక్షల దాకా అప్పులుండటంతో వాటిని ఎలా తీర్చాలోనని మదనపడేవాడు. ఈక్రమంలో బుధవారం తోటలోకి వెళ్లి విష గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.



తాడిపత్రి వైఎస్సార్ సర్కిల్‌కు చేరుకున్న గణేశుడి శోభాయాత్ర



తాడిపత్రి రూరల్: గన్నేవారిపల్లి కాలనీలో విగ్రహాల ఊరేగింపు



గౌరీపుత్రునికి వీడ్కోలు పలికేందుకు బారులుదీరిన భక్తులు



నిమజ్జనానికి బయలుదేరిన భారీ గణనాథులు

బై బై గణేశా..

- గంగ ఒడిలోకి గణనాథుడు
- వైభవంగా గణేశుని నిమజ్జనం



పెద్దవడుగూరులో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

తాడిపత్రి అర్బన్: గణాధిపతి...సిద్ధి బుద్ధి ప్రదాత...తొలి పూజలందుకున్న గౌరీ నందనుడు గంగమ్మ ఒడికి చేరాడు. ఐదు రోజులుగా వివిధ రూపాల్లో మండపాల్లో కొలువుదీరి భక్తులకు దర్శనమిచ్చిన కొండంత దేవుడు మళ్లీ వస్తానంటూ సెలవు తీసుకున్నాడు. ఐదు రోజుల పాటు పత్రి, గరిక పూజలు అందుకుని... పండ్లు, పాయసం, ఉండ్రాళ్ళు ఆరగించిన బొజ్జ గణపయ్య బుధవారం నిమజ్జనానికి బయలుదేరాడు. ఇందుకోసం పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 3గంటలకు స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద గణేషుడి శోభా యాత్రను ఎమ్మెల్యే జేసీ. అస్మిత్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. వినాయకుడి ప్రతిమలకు ఉదయమే ప్రత్యేక పూజలు చేసి విశేషంగా అలంకరించిన వాహనాల్లోకి తరలించారు. మూషిక వాహనుడికి లారీలు, ట్రాక్టర్లు, ఆటోలు అన్నీ వాహనాలయ్యాయి.

పట్టణంలో కోలాహలం..

ఈ ఏడాది 800 విగ్రహాలకు పైగా ఏర్పాటు చేయడంతో పట్టణంలో కోలాహలం నెలకొంది.చిన్నా పెద్దా తేడా లేకుండా మహిళలు సైతం రంగులు చల్లుకుంటూ సంతోషంగా నిమజ్జన వేడుకల్లో పాలుపంచుకున్నారు. గణపతి బొప్పామోరియా, జైబోలో గణేష్ మహారాజ్‌కీ జై అంటూ వీరభక్తిని చాటుకున్నారు. కాషాయ రిబ్బన్లు, టోపీలు, జెండాలు ధరించి డప్పు చప్పుళ్ల మధ్య నృత్యాలు చేస్తూ గణేషుని శోభాయాత్రకు స్వాగతం పలికారు. పట్టణంలోని వినాయక విగ్రహాలన్నీ మధ్యాహ్నం 2గంటలకు పోలీస్ స్టేషన్ సర్కిల్‌కు చేరుకున్నాయి. అక్కడి నుంచి గణేషుడి శోభాయాత్ర ప్రారంభమై రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. శోభాయాత్ర స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి సిబి రోడ్డులోని అశోక్ పిల్లర్ మీదుగా పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి సమీపంలోని కుంట వరకు సాగింది. భారీ విగ్రహాలను రూరల్ పరిధిలోని యర్రగుంటపల్లి సమీపంలోని చింతకుంట వద్ద ఉన్న కుంటలో నిమజ్జనం చేశారు. నిమజ్జనం నిర్వహించే ప్రాంతాల్లో క్రేన్లు, ప్రొక్‌లైన్లు, అంబులెన్స్‌లు ఏర్పాటు చేయడమే కాకుండా నిమజ్జన ప్రాంతాల్లో పోలీసులు గస్తీ నిర్వహించారు. అదనపు ఎస్పీ రమణమూర్తి పర్యవేక్షణలో డీఎస్పీ కె.జనార్దన్‌నాయుడు, అర్బన్ సీఐ సాయిప్రసాద్, రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి బందోబస్తును పర్యవేక్షించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

తాడిపత్రి రూరల్: గన్నేవారిపల్లికాలనీ, పోతులయ్య పాలెంలో వివిధ ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను ఊరేగింపు ఘనంగా జరిగింది. యువకులు, మహిళలు రంగులు చల్లుకుంటూ డప్పులకు అనుగుణంగా నృత్యాలు చేశారు. విగ్రహాలు కడప రోడ్డుకు చేరుకొని పట్టణంలో జరుగుతున్న ఊరేగింపులో కలిసిపోయాయి. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్‌గ్రేడ్ రూరల్ సీఐ శివగంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

పామిడి: పట్టణంలోబుధవారం సాయంత్రం గణేష్ నిమజ్జనాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్ద విఠోబదేవాలయ వద్ద లాల్‌బాగ్‌చా రాజా వినాయక ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భారీ విఘ్నేశ్వరుని ప్రతిమను ట్రాక్టర్లపై రాత్రి పొద్దుపోయే దాకా పురవీధులగుండా ఊరేగించారు. డప్పుల మోతల నడుమ యువత కేరింతలు కొడుతూ గణేష్ మహారాజ్‌కు జై అంటూ నినదించారు. అనంతరం నిమజ్జనానికై భారీ వినాయక ప్రతిమను జీ కొట్టాల క్వారీ వద్ద గల చెరువుకు తరలించారు. మిగతా బొజ్జ గణపయ్య విగ్రహాలను స్థానిక పెన్నానదిలో నిమజ్జనానికి తీసుకెళ్లారు. సీఐ యుగంధర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

పెద్దవడుగూరు : మండల కేంద్రంలో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా నరసింహా కాలనీవాసులు వినాయకుడిని జేసీబీపై ఊరేగించారు. మహిళలు నృత్యాలతో అలరించారు. ఎస్ఐ చిన్నరెడ్డప్ప ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలో బుధవారం వినాయక నిమజ్జనం ఘనంగా జరిగింది. వినాయక విగ్రహాలను ట్రాక్టర్లపై ఉంచి పుర వీధుల్లో డప్పు వాయిద్యాల నడుమ ఊరేగించారు. యువకులు రంగులు చల్లుకుంటూ నృత్యాలు చేస్తూ ముందుకు సాగారు. అనంతరం సమీపంలో ఉన్న చిక్కవడియార్ చెరువులో నిమజ్జనం చేశారు. సీఐ కరుణాకర్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



పామిడిలో గణపయ్యను నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

పెద్దపప్పూరు: వినాయక నిమజ్జనం సందర్భంగా చీమలవాగుపల్లి హైవే సమీపంలోని నీటికుంటవద్ద పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. డీఎస్పీ జనార్ధన్‌నాయుడు, సీఐ రామసుబ్బయ్య, ఎస్ఐ గౌస్‌బాషా పర్యవేక్షించారు.

గుత్తి: బసినేపల్లి గ్రామంలో బుధవారం గణనాథుల నిమజ్జన కార్యక్రమం ఘనంగా జరిగింది. ట్రాక్టర్లు, ఆటోలలో వినాయక విగ్రహాలను ఉంచి గ్రామ శివారులోని కుంటలకు తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ ఆశాబేగం బందోబస్తు నిర్వహించారు. ఇదిలా ఉండగా గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద వినాయకుడి చేతిలో ఉంచిన లడ్డూ వేలం వేశారు.రైల్వే ఉద్యోగి పవన్ కుమార్ రాయల్ రూ. 82 వేలకు లడ్డూను దక్కించుకున్నాడు.





గుత్తి మండలం బసినేపల్లిలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం



బీకేఎస్‌లో వినాయకుడిని ఊరేగిస్తున్న దృశ్యం



పెద్దపప్పూరు మండలం చీమలవాగుపల్లి కుంట వద్ద వినాయకులను నిమజ్జనం చేస్తున్న దృశ్యం



పెద్దవడుగూరులో నృత్యం చేస్తున్న మహిళలు



తాడిపత్రిలో నృత్యం చేస్తున్న యువకులు



తాడపత్రిలోని సీబీరోడ్డులోని బండా మసీదు వద్ద బందోబస్తులో పోలీసులు

వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం



కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే



తాడిపత్రి: విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్‌సీపీ తాడిపత్రి నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడారు. ప్రకృతి వైపరీత్యాలు సంభవించడం సహజమని, ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకుండా చేతులు కట్టుకుని కూర్చోవడం ఎంతవరకూ సమంజసమని ప్రశ్నించారు. ప్రకృతి వైపరీత్యాలపై ముందస్తుగా తెలియజేసే టెక్నాలజీ, వ్యవస్థలు ఉన్నాయన్నారు. కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌ల నిర్లక్ష్య ధోరణి మూలంగానే దాదాపు 50 మంది వరకు మృత్యువాత పడ్డారన్నారు. ఇవి ప్రభుత్వ హత్యలని ఘంటాపథంగా చెబుతున్నానన్నారు. వాతావరణశాఖ భారీ వర్షాలు కురుస్తాయని ప్రభుత్వానికి ముందస్తుగా సమాచారం అందించిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం ఈ విషయాన్ని పెడచెవిన పెట్టిందన్నారు. ఫలితంగా విజయవాడలో వరద బీభత్సం సృష్టించిందన్నారు. బుడమేరు వరద పరిస్థితి, వెలగలేరు రెగ్యులేటరీ గేట్లు ఎత్తాల్సి వస్తుందని తెలిసినా ప్రభుత్వం ప్రజలకు సమాచారం అందించలేదన్నారు. దీంతో విజయవాడలోని లోతట్టు ప్రాంతాలు జలమయం కావడంతోపాటు కనీవినీ ఎరుగని నష్టం వాటిల్లిందన్నారు. ఆయా శాఖల అధికారులు కొందరు ప్రభుత్వానికి జరగనున్న ఉపద్రవంపై ముఖ్యమంత్రి చంద్రబాబు తగిన చర్యలు చేపట్టలేదని ఆరోపించారు.

ప్రకటనలు తప్ప ఆచరణ ఏదీ?

విజయవాడ వరద బాధితులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తోందే తప్ప ఆచరణకు దిగడం లేదని మాజీ ఎమ్మెల్యే మండిపడ్డారు. వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు నగదు సాయం ఊసేలేదన్నారు. చంద్రబాబు వరద బాధితులను ఆదుకున్నట్లుగా ఆయా ప్రాంతాల్లో చేపట్టిన పర్యటనలు కేవలం ప్రచారం కోసమేనని విమర్శించారు. వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హయాంలో కృష్ణానదికి ప్రొటెక్షన్ వాల్ నిర్మించడంతో వేలాది మంది ప్రజలు ప్రాణాలతో బయటపడ్డారని గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వరద బాధితులను ఆదుకోవాలని ఆయన కోరారు.

కొనసాగిన 'సత్యసాయి' కార్మికుల సమ్మె

బుక్కరాయసముద్రం: తమ సమస్యలు తీర్చాలని డిమాండ్ చేస్తూ సత్యసాయి తాగు నీటి పథకం కార్మికులు బుధవారం 21వ రోజూ సమ్మె కొనసాగించారు. ఈసందర్భంగా స్థానిక ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టారు. కార్మిక సంఘం నేతలు రాఘవేంద్రాచారి, దేవదాస్, కిష్టప్ప, నాగరాజు పెద్దన్న, విశ్వరూప, విశ్వనాథ్ వలి పాల్గొన్నారు.

టీచర్‌కు తీవ్రగాయాలు

గుత్తి: పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై మాసినేని పాఠశాల వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో టీచర్‌కు తీవ్రగాయాలయ్యాయి. పట్టణానికి చెందిన శాంత కుమారి పామిడి కస్తూర్బా పాఠశాలలో టీచర్‌గా పని చేస్తోంది. పాఠశాల ముగిశాక బైక్‌పై గుత్తికి బయలు దేరింది. మాసినేని పాఠశాల వద్దకు రాగానే ఆమెను బైక్‌ను ఆర్టీసీ బస్సు వెనుక నుంచి బైక్‌ను ఢీకొనింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమెను స్థానికులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇదిలా ఉండగా పట్టణ శివారులోని అనంతపురం రోడ్డుపై నడిచి వెళ్తున్న బీహార్ వాసి ఉమర్‌ను బుధవారం గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు.

ఆర్టీసీ బస్సుపై రాయితో దాడి

పట్టణ శివారులోని గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ వద్ద గుత్తికి చెందిన రామిరెడ్డి అనే వ్యక్తి బుధవారం గుంతకల్లు ఆర్టీసీ డిపో బస్సుపై రాయితో దాడి చేశాడు. ఘటనలో బస్సు అద్దాలు పగిలాయి. ప్రయాణికులు త్రుటిలో ప్రమాదం తప్పించుకున్నారు. రామిరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

కోడిపందెం రాయుళ్ల అరెస్ట్

పెద్దవడుగూరు: విరుపాపురం సమీపంలో బుధవారం కోడి పందెం ఆడుతున్న 9 మందిని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. వీరి నుంచి ఓ కోడి, రూ.32,600 నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు

బుక్కరాయసముద్రం: చిరుధాన్యాల సాగు లాభదాయకంగా ఉంటుందని రేకులకుంటలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధనా స్థానం అధిపతి, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు పేర్కొన్నారు. బుధవారం పరిశోధనా స్థానంలో అఖిల భారతీయ పరిశోధనా మండలి సజ్జ షెడ్యూల్ కులాల ఉప ప్రణాళికలో భాగంగా కరిడికొండ, ఊబిచెర్ల, అమ్మవారిపేట గ్రామాల రైతులకు చిరుధాన్యాల పంటలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన శాస్త్రవేత్త మాట్లాడుతూ చిరు ధన్యాలకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందన్నారు. చిరుధాన్యాల సాగు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. అనంతరం రైతులకు స్ప్రేయర్లు పంపిణీ చేశారు. సీనియర్ శాస్త్రవేత్తలు డాక్టర్ నారాయణస్వామి, డాక్టర్ మాధవిలత, డాక్టర్ నటరాజ్, డాక్టర్ భాస్కర్‌రావు, డాక్టర్ లక్ష్మిన్, డాక్టర్ రమేష్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

జీఓ 85 వెంటనే రద్దు చేయాలి



నినాదాలు చేస్తున్న డాక్టర్ స్వాతి లక్ష్మి, సిబ్బంది



గుత్తిలో నిరసన తెలియజేస్తున్న నర్సులు

బుక్కరాయసముద్రం: స్థానిక పీహెచ్‌సీ ఎదుట బుధవారం వైద్య సిబ్బంది ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్వాతి లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం జీఓ 85 ఇవ్వడం దారుణం అన్నారు. జీఓతో వైద్యాధికారులుగా పని చేస్తున్న వారికి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. తమ 3 ఏళ్ల సర్వీస్ అర్థం లేకుండా పోయిందన్నారు. ఇలా అకస్మాత్తుగా జీఓలు మార్చడం వల్ల తమ వృత్తికి, ప్రగతికి తీవ్ర అన్యాయం వాటిల్లుతుందన్నారు. వైద్య సిబ్బంది సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. జూనియర్ డాక్టర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గార్లదిన్నె: జీఓ 85పై బుధవారం గార్లదిన్నె, యర్రగుంట్ల పీహెచ్‌సీల్లో పని చేసే వైద్యులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్యుల సర్వీసు కోటాను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ జీఓ జారీ చేయడం దారుణమన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ దిలీప్ కుమార్, డాక్టర్ గౌతమి, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: జీఓ 115ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్‌చేస్తూ గుత్తి ప్రభుత్వాసుపత్రిలో బుధవారం స్టాఫ్ నర్సులు నిరసన తెలియజేశారు. స్టాఫ్ నర్సులు రామాంజినమ్మ, దివ్య భారతి, సునీత, శ్యామల మాట్లాడుతూ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

ఈక్రాప్ బుకింగ్ చేయించుకోండి

గార్లదిన్నె: మండల వ్యాప్తంగా ఖరీఫ్‌లో రైతులు సాగు చేసిన పంటలకు గడువు లోపు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ సూచించారు. బుధవారం ఏఓ మాట్లాడుతూ మండలంలో 27,527 ఎకరాల్లో పంటలు సాగు చేయగా 40 శాతం మంది రైతులు మాత్రమే ఈ పంట నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులంతా గడువులోపు ఈ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏఆర్ పోలీసు పోస్టులు పెంచండి



జిల్లా ఎస్పీకి పూల మొక్క అందిస్తున్న యూనియన్ నేత పెద్దయ్య

బుక్కరాయసముద్రం: జిల్లాలో ఏఆర్ పోలీసు పోస్టుల సంఖ్య పెంచాలని బెటాలియన్ పోలీసు యూనియన్ రాష్ట్ర నాయకుడు పెద్దయ్య ఎస్పీ జగదీష్‌ను కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం జిల్లా ఎస్పీని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దయ్య పోలీసు సంక్షేమానికి కృషి చేయాలని ఎస్పీని కోరారు. ఏపీఎస్పీ నుంచి డీఏఆర్ కన్వర్షన్ హెడ్ ఆఫీస్ నుంచి ఏఆర్ పోస్టులు ఎక్కువగా కేటాయించాలన్నారు. ఈసందర్భంగా ఎస్పీ పెద్దయ్యతో జంతలూరు వద్ద ఉన్న ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌లో అభివృద్ధి పనులు, సిబ్బంది యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం

గుంతకల్లు రూరల్: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పుష్పావతి పేర్కొన్నారు. బుధవారం మైనాపురం గ్రామంలో పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహించారు. ఈసందర్భంగా సూపర్‌వైజర్ పౌష్టికాహారంతో కలిగే ప్రయోజనాలు, పౌష్టికాహార లోపం వల్ల కలిగే అనర్థాలను గర్భిణులు, బాలింతలకు వివరించారు. అంతకు ముందు పౌష్టికాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు.

పెద్దవడుగూరు : స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో బుధవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహార మాసోత్సవం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, పాఠశాల హెచ్‌ఎం సుధాకర్‌బాబు పౌష్టికాహార ప్రాముఖ్యతను తెలియజేశారు. మహిళా పోలీసులు శాంతి, ప్రత్యూష, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు పెట్టుబడి సాయం అందించాలి

పెద్దవడుగూరు : రైతులకు పెట్టుబడి సాయం వెంటనే అందించాలని సీపీఎం మండల సహాయ కార్యదర్శి మద్దిలేటి, వ్యవసాయ కార్మిక సంఘం మండలాధ్యక్షుడు కృష్ణనారాయణ, రంగస్వామి కోరారు. బుధవారం క్రిష్టిపాడు గ్రామ సచివాలయం వద్ద వారు ఆందోళన చేపట్టారు. అనంతరం వీఆర్వో సుదర్శన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు.

ఇమాంపురంలో చిరుత సంచారం

గుంతకల్లు రూరల్: ఇమాంపురం, నాగసముద్రం గ్రామాల సరిహద్దు పంట పొలాల్లో మూడు రోజులుగా చిరుత సంచరిస్తోంది. చిరుత సంచారంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామస్తుల ద్వారా సమాచారం అందుకున్న అటవీ శాఖ అధికారులు గ్రామంలో పర్యటించి అప్రమత్తంగా ఉండాలంటూ ప్రజలకు అవగాహన కల్పించారు.

అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీ

గుత్తి: పట్టణంలోని కోళ్ల ఫారం, జెండా వీధిలో అంగన్‌వాడీ కేంద్రాలను బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె అంగన్‌వాడీ కేంద్రాల్లోని రికార్డులను పరిశీలించారు.

హుండీ కానుకల లెక్కింపు

తాడిపత్రి రూరల్: యుగుడూరు గంగమ్మ తల్లి ఆలయంలో బుధవారం హుండీ కానుకలు లెక్కించారు. హుండీ ద్వారా ఈ ఏడాది మార్చి 21 నుంచి ఇప్పటి వరకు రూ.3,35,628 వచ్చినట్లు ఈఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.